సాక్షి
రాజన్న సిరిసిల్ల

7

ఆదివారం । 3 । నవంబర్ । 2024

శభాష్ షీటీమ్



సిరిసిల్లక్రైం: జిల్లాలోని మహిళలు, బాలికల రక్షణ కోసం పనిచేసే షీటీమ్ సేవలను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పోకిరీల నుంచి రక్షించిన సిబ్బంది సేవలను కొనియాడారు. షీటీమ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి శనివారం రివార్డులు అందించారు. గతేడాది కాలంలో షీటీంకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి 42 కేసులు, 54 పెట్టి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మహిళలు సోషల్‌మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేధింపులకు గురైతే 87126 56425లో సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. షీటీమ్ సిబ్బంది ప్రమీల, వీరయ్య, ప్రియాంక, రవళి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు వరదవెల్లికి కేంద్రమంత్రి సంజయ్ రాక

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామి ఆలయానికి సమకూర్చిన బోటును ప్రారంభించేందుకు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వస్తున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపారు. గతేడాది దత్తత్రేయస్వామి ఉత్సవాలకు బండి సంజయ్‌కుమార్ హాజరుకాగా.. బోటు సౌకర్యం కావాలని భక్తులు కోరారు. ఈమేరకు బోటు కోసం రూ.10.60లక్షలు కేటాయించారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి



సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.గంగాధర్‌ను ఆర్టిజన్లు కోరారు. ఈమేరకు శనివారం కరీంనగర్‌లోని కార్యాలయంలో కలిసి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సిరిసిల్ల డివిజన్ పరిధిలోని 78 సబ్ స్టేషన్లలో 312 మందికి 198 మంది మాత్రమే ఉన్నారన్నారు. యూనియన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ రాచకొండ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్‌కుమార్, డివిజన్ సెక్రటరీ నవసిలాల్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్‌లో బీఎల్‌వోలు, కార్యదర్శులు, మహిళా సంఘాల వీవోలతో ఓటరు నమోదుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్పీ సీఈవో వినోద్ మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగహన కల్పించాలన్నారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర తదితరులు ఉన్నారు.

వర్క్‌షాపులతో జ్ఞానం పెంపు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులకు వర్క్‌షాప్స్‌తో జ్ఞానం పెంపొందుతుందని నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ పత్తిపాక మోహన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్ ఫిఫ్టీ-2024 వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ల్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌ను విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. ఎస్సార్ పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ విష్ణు, స్కూల్ హెచ్ఎం మోతిలాల్, స్టాఫ్ సెక్రటరీ కుమ్మరి మల్లేశం, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి పాకాల శంకర్‌గౌడ్, సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



సిరిసిల్ల/కోనరావుపేట(వేములవాడ): కుటుంబ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, కోనరావుపేట మండలం కొలనూర్, ధర్మారం గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను శనివారం తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్ బ్లాక్ పరిధిలోని పది ఇళ్లలో పరిశీలించారు. ఎస్డీసీ రాధాబాయి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య ఉన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

రగుడు రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పంపిణీ విధానం పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉన్న సరుకులు, రిజిస్టర్లు తనిఖీ చేసి, రేషన్ డీలర్‌కు పలు సూచనలు చేశారు.

అమెరికా ఎన్నికల్లో.. ఎన్ని ప్రత్యేకతలో!





- రెండే పార్టీలు • నాలుగేళ్లకోసారి ఎన్నికలు • నవంబర్ మొదటి మంగళవారం నిర్వహణ
- టెక్నాలజీలో ముందున్నా ఇప్పటికీ బ్యాలెట్ విధానమే.. • అమెరికా పౌరసత్వం ఉంటేనే ఓటుహక్కు
- పోలింగ్‌కు ముందే ఆన్‌లైన్‌లో ఓటేయొచ్చు • ఓటు వేయనున్న పలువురు ఉమ్మడి జిల్లావాసులు

సండే స్పెషల్

అమెరికా.. అగ్రరాజ్యం.. ఎంతోమంది ఒక్కసారైనా వెళ్లిరావాలని కలలుగనే దేశం. చదువు, ఉద్యోగాల పేరిట మన దేశం నుంచి చాలామంది అక్కడికి వెళ్లి, స్థిరపడ్డారు. ఇప్పటికీ వెళ్తున్నారు. ఆ దేశాధినేత ఎన్నిక ప్రక్రియ కీలక దశకు చేరింది. అక్టోబర్ 15 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఎర్లీ ఓటింగ్ ముగిసింది. 5న ఫైనల్ ఓటింగ్ జరగనుంది. ఎవరు గెలిచి వైట్‌హౌస్‌లో అడుగుపెడతారోనని ప్రపంచదేశాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికా పౌరసత్వం ఉంటేనే ఓటుహక్కు వస్తుంది. టెక్నాలజీలో ముందున్నా ఇప్పటికీ ఎన్నికల్లో బ్యాలెట్ విధానమే అవలంబిస్తున్నారు. పౌరసత్వం ఐడీకార్డును ఓటువేసే మెషిన్‌లో పెడితే ఒపీనియన్ పోల్ వస్తుంది. ఎవరికి ఓటు వేయాలో వారిపేరుపై టచ్ స్క్రీన్‌లో టచ్ చేస్తే ప్రింట్ వస్తుంది. అందులో వివరాలు నింపి, బాక్స్‌లో వేస్తే ఓటు వేయడం పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో అమెరికాలో ఓటుహక్కు వినియోగించుకునే పలువురు ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల అభిప్రాయాలతో సండే స్పెషల్..!!

హోరాహోరీ పోరు



కరీంనగర్ స్పోర్ట్స్: మాది కరీంనగర్. నేను అమెరికా వచ్చి సుమారు 20 ఏళ్లవుతోంది. నార్త్ కరోలినా స్టేట్‌లోని వెల్స్ ఫార్గో కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా, డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాను. నా భార్య శ్వేత కూడా ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలు. అమెరికా ఎన్నికల్లో ప్రతీసారి భారతీయుల చాయిస్ డిఫరెంట్‌గా ఉంటుంది. ఈసారి భారత సంతతికి చెందిన కమలాహారిస్ బరిలో ఉండటంతో భారతీయులు ఆమెకు సపోర్టు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికన్ భారతీయుల్లో బిజినెస్ చేసేవారు ట్రంప్‌కు మద్దతు తెలపనున్నారు. మొత్తంగా చూస్తే ఇద్దరి మధ్య పోరు హోరాహోరీగా ఉందనే చెప్పాలి.

– కదారి కృష్ణారెడ్డి, నార్త్ కరోలినా



ఓట్ ఫ్రం హోమ్: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.అధికారుల సమక్షంలో ఓటువేసి, ఎన్నికల సంఘానికి మెయిల్ చేయాలి.

మంగళవారమే ఎందుకు?: అప్పట్లో అమెరికా జనాభాలో ఎక్కువ మంది వ్యవసాయం చేసేవారు. నవంబర్ నెల ఆరంభంలో పంట నూర్పిడి చేసి, ఖాళీగా ఉండేవారు. అప్పుడే ఓటు వేసేందుకు సరైన సమయమని భావించారు. క్రైస్తవులు ఎక్కువగా ఆదివారం ఆరాధన దినంగా భావించేవారు. తమ వ్యవసా య ఉత్పత్తులను అమ్మేందుకు రైతులు బుధవారం మార్కెట్‌కు వెళ్లేవారు. అప్పట్లో రవాణా వ్యవస్థ అంతగా లేదు. దీంతో పోలింగ్ జరిగే కొన్ని ప్రాంతాలకు చేరుకోడానికి ఒక రోజు సమ యం పట్టేది. కాబట్టి సోమ, గురువారాలను పరిగణలోకి తీసుకోకుండా.. మంగళవారమే పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటినుంచి అమెరికాలో నవంబర్ నెల మొదటి మంగళవారమే ఎన్నికలు జరుగుతున్నాయి.

పోటీలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు: ఎన్నికల్లో పోలింగ్ తేదీకి ముందే ఆన్‌లైన్‌లో ఓటేయొచ్చు. నాలుగేళ్లకోసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. పార్టీలు రెండే. డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పోటీలో ఉంటారు. 50 రాష్ట్రాల నుంచి 100 మంది, న్యూయార్క్ నుంచి ముగ్గురు మొత్తం 103 సెనెటర్స్, 435 మంది ప్రతినిధులు మొత్తం 538 మందిని ఓటర్లు ఎన్నుకుంటారు. ఆ తర్వాత వీరు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు.

భారతీయులు ట్రంప్ వైపే



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మాది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం. అమెరికాలో స్థిరపడ్డాం. ఇక్కడి ఎన్నికల్లో నా భార్య సౌమ్యతో కలిసి మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. ఎర్లీ ఓటింగ్‌లోనే మేమిద్దరం ఓటు వేశాం. భారతీయులు ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నారు. భారతీయులకు భద్రత విషయంలో ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంప్‌కే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

– పందిరి రజనీకాంత్, అట్లాంటా

ఎన్నికల తీరును చూస్తున్న



శంకరపట్నం(మానకొండూర్): మాది శంకరపట్నం మండలంలోని గద్దపాక. టీచర్‌గా రిటైరయ్యాను. నా ఇద్దరు కూతుళ్లు అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డారు. ఇటీవలే వారి వద్దకు వచ్చాను. నేను టీచర్‌గా కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వర్తించాను. ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాలో ఎన్నికల తీరును ప్రత్యక్షంగా చూస్తున్న.

– పల్కల శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్

ఒక్కశాతం ఓట్లతోనే గెలుపు



ఇల్లంతకుంట(మానకొండూర్): మాది ఇల్లంతకుంట మండలంలోని ముస్కాన్‌పేట. నేను బీటెక్ చదివి, 2008లో అమెరికా వచ్చాను. డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న. ఇక్కడే స్థిరపడ్డారు. భార్య అంజలి, కూతురు ఉన్నారు. ఈ నెల 5న జరిగే అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ మధ్య హోరాహోరీ పోరు జరుగుతోంది. ఇద్దరిలో ఎవరు గెలిచినా ఒక్కశాతం ఓట్లతోనే గెలుస్తారు.

– కోమటిరెడ్డి వంశీధర్‌రెడ్డి, డల్లాస్

అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి పోలింగ్



హుజూరాబాద్‌రూరల్: మాది హుజూరాబాద్. నేను ఏడాదిన్నరగా అమెరికాలోని డల్లాస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఈ దేశాధ్యక్ష ఎన్నికల్లో టెక్నాలజీ ప్రభావం ఎక్కువగా ఉంది. పట్టణం, గ్రామీణ ప్రాంతమనే తేడా లేకుండా బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అధ్యక్ష అభ్యర్థులతో చర్చలు నిర్వహించడం బాగుంది. అన్ని రాష్ట్రాల్లో ఒకే సారి పోలింగ్ పూర్తయ్యేలా చూస్తారు. ఇక్కడి తెలుగు ప్రజలు భారత సంతతికి చెందిన కమలాహారిస్‌కు ఓటు వేసేందుకే ఆసక్తి చూపుతున్నారు.

– కె.సాయితేజ, డల్లాస్

గెలుపుపై సర్వత్రా ఆసక్తి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మాది యైటింక్లయిన్‌కాలనీ. నేను అమెరికా స్కాంబర్గ్ ప్రాంతంలోని యూఎస్‌ఫుడ్స్‌లో ఇంజినీర్‌గా చేస్తున్నా. ఇక్కడ ఎలక్టోరల్ కాలేజ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో స్టేట్‌లో ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చాయో చూస్తారు. సదరు అభ్యర్థికి సంబంధిత స్టేట్ బాధ్యతలు అప్పగిస్తారు. ప్రస్తుతం ట్రంప్ కన్నా కమలాహారిస్‌కే ఎక్కువ మద్దతు ఉందన్న చర్చ జరుగుతోంది. కొన్ని ఏరియాల్లో ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎవరు గెలుస్తారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

– ఆడెపు ఉపేందర్, స్కాంబర్గ్

ట్రంప్ ప్రభుత్వం ఆదుకుంది



గోదావరిఖని(రామగుండం): మాది పెద్దపల్లి. అమెరికాలో వీసాల కోసం న్యాయసాయం చేస్తుంటాను. కరోనా సమయంలో ట్రంప్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ఆర్థికసాయం చేసి, ఆదుకుంది. ప్రస్తుతం ఉన్న డెమోక్రటిక్ ప్రభుత్వం ప్రజల ఆదరణ చూరగొనలేదు. అయితే, పాకిస్తాన్‌ను వచ్చి, ఇక్కడ స్థిరపడినవారు కమలాహారిస్‌కు మద్దతు ఇస్తున్నారు. భారతీయులు ట్రంప్‌వైపు మొగ్గు చూపుతున్నారు.

– కలవల విశ్వేశ్వర్‌రెడ్డి, వాషింగ్టన్ డీసీ

కమలాహారిస్‌కే ప్రియారిటీ



కరీంనగర్ స్పోర్ట్స్: మాది కరీంనగర్. నేను ఎంఎస్ కోసం అమెరికా వచ్చాను. ఏడాదవుతోంది. కన్సాస్ సిటీ స్టేట్‌లోని ఓవర్ ల్యాండ్ పార్క్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి ఉంటున్నాను. అంతటా ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. నేను ఫస్ట్ టైమ్ అమెరికాలో ఎన్నికల తీరును చూడబోతున్న. భారత సంతతికి చెందిన కమలాహారిస్‌కు ఈ స్టేట్‌లో ప్రియారిటీ ఉంది.

– గన్ను అనిరుధ్ రెడ్డి, కన్సాస్ సిటీ

భారతీయులకు ఎక్కువ హామీలు



గోదావరిఖని(రామగుండం): మాది గోదావరిఖని. నేను అమెరికాలోని ఆస్టిన్ టెక్సాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గ్రీన్ కార్డు సాధించాను. ఇక్కడి ఎన్నికలపై ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా ఉన్నాయి. అయితే, ఎక్కువ మంది భారతీయులు భారత సంతతికి చెందిన కమలాహారిస్ కాకుండా డొనాల్డ్ ట్రంప్‌వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వంలో ఉపాధ్యక్షురాలిగా ఉన్న హారిస్‌కు అనుభవం ఉన్నప్పటికీ ప్రజల్లో వ్యతిరేకత ఉంది. కోవిడ్ కష్టకాలంలో ఆదుకోవడంతో ట్రంప్‌పై సానుభూతి ఎక్కువగా ఉంది. అంతేకాకుండా, భారతీయులకు ఆయనే ఎక్కువ హామీలు ఇచ్చారు.

– గంట మురళి, ఆస్టిన్ టెక్సాస్

టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు ప్రారంభించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు పూర్తిస్థాయిలో ప్రారంభించి, కార్మికులకు పని కల్పించాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. శనివారం బద్దెనపల్లి-సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు ఎదుట శనివారం పవర్‌లూమ్ కార్మికులతో నిరసన తెలిపి, మాట్లాడారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు 20 ఏళ్ల క్రితం టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారన్నారు. యజమానులు తరచూ పరిశ్రమలను మూసివేస్తుండడంతో కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆర్డర్లను పట్టించుకోకుండా కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడుతూ పరిశ్రమలను నడపడంతో కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులతో సమీక్షించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, ఆడెపు శుభోఖర్, దూస రాజమల్లు, ఆడెపు రవి, సంపత్, శ్రీనివాస్, ఆంజనేయులు, వరప్రసాద్, రంగయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, రమేశ్, అశోక్, రాజు పాల్గొన్నారు.



టెక్స్‌టైల్ పార్కు గేటు ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

అపెరల్ పార్క్‌లో 'సెస్' స్టోర్

- 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) స్టోర్‌ను సిరిసిల్ల పట్టణ శివారులోని అపెరల్ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ చిక్కాల రామారావు శనివారం తెలిపారు. జిల్లా కేంద్రం శివారులోని మానేరు వాగు తీరంలోని 'సెస్' స్టోర్స్‌ను ఎనిమిదేళ్ల క్రితం రైతు బజార్‌కు కేటాయించారు. దీంతో 'సెస్' స్టోర్స్‌కు సొంత స్థలం లేక అద్దె భవనాల్లో రైస్‌మిల్లుల్లో కొనసాగించారు. ప్రస్తుతం సిరిసిల్ల సాయినగర్‌లోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. 'సెస్' స్టోర్స్ కోసం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి వద్ద కేటాయించిన స్థలం అనువుగా లేకపోవడంతో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. సిరిసిల్ల ఇందిరానగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు(చేనేత జౌళిశాఖ గోదాముల) స్థలాన్ని ఇవ్వాలని 'సెస్' అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. కానీ అప్పటికే ఏఎంసీ స్థలాన్ని నేతబజారు కోసం కేటాయించారు. ఈక్రమంలో పెద్దూరు బైపాస్‌రోడ్డులో మెడికల్ కాలేజీ ఎదుట గల అపెరల్‌పార్క్‌లోని రెండు షెడ్లతో 'సెస్' స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ రామారావు తెలిపారు. రహదారి సౌకర్యం ఉండడంతో 'సెస్' పరిధిలోని అన్ని ప్రాంతాల వినియోగదారులు సులభంగా రాకపోకలు సాగించేందుకు అపెరల్ పార్క్ అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

మీ పేరు ఉందో చూసుకోండి

- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- 3,517 పోలింగ్ కేంద్రాలు..
- 29,90,319 ఓటర్లు
- మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- 2025 జనవరి 6న తుది జాబితా విడుదల



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల సంఘం ఏటా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్-ఎస్ఎస్ఆర్) షెడ్యూల్ ప్రకటించి.. నవంబర్‌లో ముసాయిదా జాబితా.. జనవరిలో తుది ఓటరు జాబితా విడుదల చేస్తుంది. ఓటర్ జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 3,517 పోలింగ్ కేంద్రాల్లో 29,90,319 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లా ఓటరు ముసాయిదా జాబితా వివరాలు

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలలు	ఇతరులు	మొత్తం
జగిత్యాల	254	1,13,928	1,23,872	23	2,37,823
కోరుట్ల	262	1,17,287	1,29,916	4	2,47,207
ధర్మపురి	269	1,12,972	1,18,863	9	2,31,844
రామగుండం	262	1,10,011	1,10,303	28	2,20,342
మంథని	292	1,17,953	1,23,148	15	2,41,116
పెద్దపల్లి	291	1,27,106	1,30,920	7	2,58,033
కరీంనగర్	390	1,82,791	1,83,810	45	3,66,646
చొప్పదండి	327	1,13,314	1,21,179	8	2,34,501
మానకొండూర్	316	1,10,503	1,16,063	1	2,26,567
హుజూరాబాద్	305	1,22,215	1,29,122	7	2,51,344
వేములవాడ	262	108675	118808	30	227513
సిరిసిల్ల	287	1,20,070	1,27,306	7	2,47,383
మొత్తం	3,517	14,56,825	15,33,310	184	29,90,319

మహిళా ఓటర్లే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కరీంనగర్‌లో అత్యధిక ఓటర్లు 3,66,646 మంది ఉన్నారు. అత్యల్పంగా రామగుండంలో 2,20,342 మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29,90,319 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుష ఓటర్లు 14,56,825 మంది ఉండగా.. మహిళలు 15,33,310 మంది, ఇతరులు 184మంది ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఏమైనా చేర్పులు, తొలగింపులు, సవరణలు తదితర అభ్యంతరాలు ఉంటే నవంబర్ 28వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. కొత్తగా చేరాలనుకునే వారు ఫాం-6, తొలగించుకోవాలనుకునే వారు ఫాం-7, సవరణ చేసుకోవాలనుకునే వారు ఫాం-8 ఆధారంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2025 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసేందుకు నవంబరు 9, 10 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది జాబితాను ప్రకటించనున్నారు.

క్లుప్తంగా

‘యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్’ అందజేత



అవార్డుతో మహిపాల్‌రెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడకు చెందిన యువ శాస్త్రవేత్త గంజి మహిపాల్‌రెడ్డి యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్–2024 అవార్డు అందుకున్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. హాంకాంగ్ ఏషియన్ యంగ్ సైంటిస్ట్ ఫెలోషిప్, హాంకాంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్, ది యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ సంస్థలు సంయుక్తంగా ఈ అవార్డును శుక్రవారం హాంకాంగ్‌లో ప్రదానం చేశాయి.

ప్రతీ కుటుంబం లిస్టింగ్ తప్పనిసరి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



సిరిసిల్ల: జిల్లాలోని ప్రతీ కుటుంబం లిస్టింగ్ తప్పనిసరిగా చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమగ్ర ఇంటింటీ కుటుంబ సర్వేపై సమీక్షించారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో భాగంగా ఈనెల 3 వరకు హౌస్‌లిస్టింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 1.95 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా, రెండు రోజుల్లో 1.25లక్షల కుటుంబాల లిస్టింగ్ పూర్తయిందని అధికారులు వివరించారు. సమగ్ర ఇంటింటీ కుటుంబ సర్వేలో ప్రతీ కుటుంబం వివరాలు సేకరించాలని సూచించారు. ఎస్‌డీసీ రాధాబాయి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, సీపీవో శ్రీనివాసాచారి, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

వర్కర్ టు ఓనర్ ప్రారంభించాలి

సిరిసిల్లటౌన్: నేతకార్మికులకు శాశ్వత ఉపాధి అందించాలన్న లక్ష్యంతో సిరిసిల్లలో నిర్మించిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. ఈమేరకు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిర్మించిన షెడ్లను ఇతరులకు కేటాయించొద్దన్నారు. గత ప్రభుత్వం 1104 మంది కార్మికులకు ఒక్కొక్కరికి నాలుగు పవర్‌లూమ్స్ అందిస్తామన్న లక్ష్యంతో షెడ్లను నిర్మించిందని, లబ్ధిదారులను ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వం కార్మికుల చిరకాల ఆశయం వర్కర్ టు ఓనర్ పథకం అమలు చేయాలని కోరారు. కోడం రమణ తదితరులు ఉన్నారు.

రాజన్న సేవలో ప్రముఖులు



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలగించి, స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ జె.శ్రీనివాసరావు దర్శించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

అమ్మిందే మాంసం !

- అధికారుల తనిఖీలు శూన్యం
- పశువైద్యాధికారి ధ్రువీకరణ లేదు
- రోడ్డుపక్కన ఓపెన్ ప్లేస్‌లో విక్రయాలు
- దుమ్ము, దూళి పారుతున్న పట్టింపు కరువు
- వేములవాడలో పూర్తికాని స్లాటర్‌హౌస్
- మున్సిపల్ అధికారుల తనిఖీలు శూన్యం



రోడ్డుపైనే మాంసం విక్రయిస్తున్న ఈ దృశ్యం వేములవాడలోనిది. పట్టణంలో చాలా మంది వ్యాపారులు ఇలాగే రోడ్లపైనే మాంసం విక్రయిస్తున్నారు. రోడ్డుపై వాహనాలు వెళ్తుండగా వచ్చే దుమ్ము, దూళి పారుతున్న పట్టించుకునే వారు లేరు. అంతేకాకుండా ఇంటి వద్దే మేకలు, గొర్రెలను కోస్తుండడంతో పశువైద్యాధికారి, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది.

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలో మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. స్లాటర్ హౌస్ పూర్తికాకపోవడంతో ఇంటి వద్దే జీవాలను కోస్తూ రోడ్డు పక్కనే మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము దూళి మాంసంపై పడుతున్న వ్యాపారులు పట్టించుకోవడం లేదు. శుచి, శుభ్రత లేని ప్రాంతాల్లోనే విక్రయాలు సాగిస్తున్నారు. సిరిసిల్లలోనూ మాంసం వ్యాపారులు కనీస నిబంధనలు పాటించడం లేదు.

స్లాటర్‌హౌస్ లేక.. పర్యవేక్షణ కరువు

వేములవాడ మున్సిపల్ పరిధిలో మాంసం కోసేందుకు స్లాటర్‌హౌస్ లేదు. ఇటీవల పనులు చేపట్టిన స్లాటర్‌హౌస్ ఇంకా పూర్తికాలేదు. ఫలితంగా మాంసం విక్రయించే వ్యాపారులు మేకలు, గొర్రెలను తమ ఇంటి వద్దే కోస్తున్నారు. ఈక్రమంలో కనీసం పశువైద్యాధికారితో కానీ, మున్సిపల్ అధికారులతో కానీ సర్టిఫై చేయించిన దాఖలాలు లేవు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనారోగ్యంగా ఉన్న, బక్కపలచిన గొర్రెలు, మేకలను కోస్తూ మాంసం విక్రయిస్తున్నారు. నాణ్యత లేని మాంసం విక్రయాలు వేములవాడలో జోరుగా సాగుతున్నాయి.

నిబంధనలు పాటించాలి



మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించాలి. రోడ్లపైన ఎక్కడ పడితే అక్కడ మేకలు, గొర్రెలను కటింగ్ చేసి అమ్మొద్దు. మాంసం విక్రయించుకునేందుకు వ్యాపారులకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక షెడ్లు నిర్మించి ఇస్తే బాగుంటుంది.

– నందిపేట సుదర్శన్‌యాదవ్, ఆలయ మాజీ ధర్మకర్త, వేములవాడ

ఎలాంటి అధికారాలు లేవు



జీవాలను తనిఖీ చేసే అధికారులు మాకు లేవు. అయితే చాలా మంది వ్యాపారులు తమ ఇళ్ల వద్దనే కోస్తున్నట్లు తెలిసింది. పండుగల సందర్భంగా స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే బాధ్యతలు అప్పగిస్తున్నారు. వీటితోపాటు ట్రాన్స్‌పోర్ట్‌లో కూడా హెల్త్ అండ్ వెల్త్ గుర్తిస్తాం.

– అభిలాష్, వెటర్నరీ వైద్యుడు, వేములవాడ

తనిఖీలు నిర్వహిస్తాం



నిబంధనలు పాటించకుండా మాంసం విక్రయిస్తున్న వ్యాపారులపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడతాం. మరికొన్ని నెలల్లో స్లాటర్‌హౌస్ కూడా పూర్తవుతుంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి



స్వస్తిక్ ఆకృతిలో దీపాలు



ఓం ఆకృతిలో దీపాలు

వైభవంగా కార్తీక దీపోత్సవం

వేములవాడఅర్బన్: కార్తీమాసం సందర్భంగా రాజన్న ఆలయంలో శనివారం సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక మాసం మొదటి రోజు సందర్భంగా అర్చకుల వేదమంత్రాల మధ్య కార్తీకదీపాన్ని వెలిగించారు. మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించడం కోసం ఈ దీపం వెలిగిస్తారని ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, నమిలికొండ రాజేశ్వరశర్మ తెలిపారు. ఈ ఆకాశదీపాన్ని గండదీపంపై ఉంచడంతో కార్తీకమాసం మొత్తం ఉంటుందని అర్చకులు వివరించారు. ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు చంద్రగిరి శరత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలి

- సిరిసిల్ల మానేరువాగుపై రోడ్డు, రైల్వేవంతెన నిర్మించాలి
- ఢిల్లీలో ఫాలోఅప్ చేస్తేనే పనులు అవుతాయి
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల: సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి ‘365బీ’ని కోరుట్ల వరకు విస్తరించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా జాతీయ రహదారులను విస్తరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సూర్యాపేట–కోరుట్ల వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మిస్తే.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారితో, ఇటు ఆర్మూర్–జగదల్‌పూర్ జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుందన్నారు. కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శలు మాని, జాతీయ రహదారుల విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. ఢిల్లీ స్థాయిలో ఫాలో అప్ చేయాలన్నారు. సిరిసిల్ల మానేరు వంతెనపై రాజమండ్రి తరహాలో రైల్వే బ్రిడ్జి కం రోడ్డు మార్గం నిర్మాణానికి గతంలో మంత్రి కేటీఆర్‌తో కలిసి కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు.

రహదారి అలైన్‌మెంట్‌ను మార్చాలి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నుంచి ప్రతిపాదించిన జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చి రైల్వేలైన్‌తోపాటే నిర్మించాలని వినోద్‌కుమార్ కోరారు. సిరిసిల్లలో చిన్న స్థలాల యజమానులు నష్టపోతున్నారని, అలైన్‌మెంట్‌ను మార్చి పట్టణానికి దూరంగా వేయాలని కోరారు. డీపీఆర్ స్థాయిలో ఉన్నప్పుడే మార్పులకు సాధ్యమన్నారు. రహదారుల విస్తరణకు భూయజమానులు సహకరించాలని, భూములు కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, ఆకునూరి శంకరయ్య, ఏనుగు మనోహర్‌రెడ్డి, బొల్లి రామ్మోహన్, కుంబాల మల్లారెడ్డి, ‘సెస్’ డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, వరుస కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అపెరల్ పార్క్‌లో ధాన్యం నిల్వ చేయాలి



అపెరల్ పార్క్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- షెడ్లను ‘వర్కర్ టు ఓనర్’కు కేటాయించాలి
- సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అపెరల్ పార్క్‌లో నిల్వ చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. పెద్దూరు శివారులోని అపెరల్ పార్క్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో రైతుల నుంచి ఖరీఫ్ సీజన్–2024లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అపెరల్ పార్క్‌లోని షెడ్లను వినియోగించుకోవాలన్నారు. అపెరల్ పార్క్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాముల సామర్థ్యం ఉందన్నారు. జౌళిశాఖ ఏడీ సాగర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, యెల్లె లక్ష్మీనారాయణ, గోలి వెంకటరమణ, గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య ఉన్నారు.

అపెరల్ పార్క్‌లో నిల్వ చేస్తాం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 175 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, నేడు మరో 73 కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. జీవో 27పై రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించామని, బ్యాంక్‌గ్యారంటీపై రైస్‌మిల్లర్లకు చెప్పామన్నారు. జిల్లాలో అవసరమైన మేరకు అపెరల్ పార్క్‌లో గోదాములు ఉన్నాయని వాటిలో ధాన్యం నిల్వ చేస్తామని తెలిపారు. 73 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా సహకార అధికారిని రామకృష్ణను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీఎస్‌వో పి.వసంతలక్ష్మి, జిల్లా మేనేజర్ పి.రజిత, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

అపెరల్ పార్క్‌లో ధాన్యం నిల్వ చేయొద్దు

అపెరల్ పార్క్‌లో ధాన్యం నిల్వ చేయొద్దని సీఐటీయూ రాష్ట్ర నాయకులు మూషం రమేశ్, కోడం రమణ కోరారు. వర్కర్ టు ఓనర్ పథకం కోసం రూ.400 కోట్లతో గోదాములను నిర్మించారని తెలిపారు. వడ్లను నిల్వ చేస్తే ఆ షెడ్లు వర్కర్ టు ఓనర్ పథకానికి పనికిరాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నేత కార్మికులను ఓనర్లు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కులగణన ఆధారంగానే ఎన్నికలు

- మూడు నెలల్లో హైకోర్టుకు నివేదిక
- అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన ఆధారంగానే రాబోయే ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని కే కన్వెన్షన్‌హాలులో శనివారం నిర్వహించిన కులగణన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీపీసీసీ పిలుపుమేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. మూడు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి హైకోర్టుకు నివేదిస్తామన్నారు. అన్ని వర్గాలకు విద్య, వైద్యం ఉపాధి అవకాశాలపై ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కులగణన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మంది అధికారులతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో అధికారి 150 ఇళ్లకు వెళ్లి 50 ప్రశ్నలతో సర్వే చేస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పుల్లో నెట్టిందన్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పులతోనే కొందరికి రైతు రుణమాఫీలో ఆలస్యమైందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు కటుకం మృత్యుంజయం, సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఆడెపు చంద్రకళ, గోనె ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జీపీ ల్యాండ్ అన్యాక్రాంతం?

- హద్దురాళ్లు తొలగింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



హద్దురాళ్లు తొలగించిన భూమి ఇదే..

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని విలువైన జీపీ ల్యాండ్ అన్యాక్రాంతమైంది. హద్దురాళ్లు తొలగించి, చదును చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. గతంలోనూ ఈ ప్రదేశంలోని జీపీ ల్యాండ్ విషయంలో గొడవలు జరిగాయని, అప్పుడు అధికారులు సర్వే చేసి, జీపీల్యాండ్‌కు హద్దురాళ్లు ఏర్పాటు చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు కొందరు ఆ హద్దురాళ్లను తొలగించి, భూమిని చదును చేశారు. గతంలో ఈ ప్రాంతంలోని ఓ చెట్టును కొట్టివేసిన వ్యక్తికి పంచాయతీ అధికారులు నోటీస్‌లు ఇచ్చారని, ఇప్పుడు ఏకంగా భూమినే కబ్జా చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీవో సుధాకర్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా హద్దుల ప్రకారం గ్రామపంచాయతీ భూమి ఉందన్నారు. అయితే ఆ భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందని తెలిపారు. రుద్రంగి కార్యదర్శి రామ్‌దాస్ మాట్లాడుతూ అన్ని పత్రాలు పరిశీలించాకే అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సిరిసిల్ల అర్బన్: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన సిరిసిల్ల బైపాస్ రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. వేములవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడటంతో, వేములవాడకు చెందిన శివశంకర్, మానస, శ్రేయాన్వి, వినాన్వి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని గర్జనపల్లికి చెందిన ఇసంపల్లి ఆశిష్ శుక్రవారం రాత్రి తన స్నేహితులతో కలిసి బైక్‌పై అడవిపదిరకు వెళ్తుండగా వడ్డెరకాలనీ కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ఆశిష్‌కు తీవ్రగాయాలు కాగా అతని స్నేహితులు దేవరాజు, వర్ధన్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం: యువతిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై భాస్కర్ రెడ్డి వివరాల ప్రకారం.. నగరంలోని గోదాంగడ్డకు చెందిన రమేశ్, ఓ యువతి కొన్ని రోజులు సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఈ మధ్య రమేశ్ ఆమెతో గొడవ పడి, దాడి చేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరుస చోరీలు.. ఆందోళనలో రైతులు

- వాహనాల పరికరాలు ఎత్తుకెళ్తున్న దొంగలు

ధర్మారం(ధర్మపురి): గ్రామాల్లో జరుగుతున్న చోరీలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇంటి ఎదుట భద్రంగా ఉంటుందని రైతుల తమ ట్రాక్టర్‌లను పార్కింగ్ చేసినా దొంగల నుంచి కాపాడుకోలేకపోతున్నారు. ట్రాక్టర్ విడిభాగాలను దొంగలు యథేచ్ఛగా దొంగిలించుకపోతున్న ఘటనలు ధర్మారం మండలంలో ఇటీవల కాలంలో కలకలం రేపుతున్నాయి. 20 రోజుల క్రితం మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు హార్వెస్టర్‌ను తన వ్యవసాయ భూమిలో పార్కింగ్ చేయగా, అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు దాదాపు రూ.లక్ష విలువగల విడి పరికరాలను ఎత్తుకెళ్లి ధర్మారం శివారులోని స్క్రాప్ దుకాణంలో విక్రయించారు. హార్వెస్టర్ పరికరాలు చోరీకి గురైనట్లు గమనించిన సదరు రైతు నిఘా పెట్టాడు. ఈక్రమంలో హార్వెస్టర్ పరికరాన్ని విక్రయించేందుకు ఓ మైనర్ బాలుడు సైకిల్‌పై ధర్మారం తీసుకవస్తుండగా రైతుకు అనుమానం వచ్చి ప్రశ్నించాడు. సదరు మైనర్ తానొక్కడినే కాదని, మరో ఇద్దరం కలిసి హార్వెస్టర్ పరికరాలు దొంగతనం చేసి ధర్మారంలోని స్క్రాప్ దుకాణంలో విక్రయించినట్లు తెలిపాడు. వెంటనే రైతు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ముగ్గురు మైనర్ బాలురను స్క్రాప్ దుకాణం వద్దకు తీసుకెళ్లారు. సదరు బాలురు తనకే పరికరాలు విక్రయించారని దుకాణదారు ఒప్పుకున్నాడు. కాగా, పరికరాల చోరీపై సదరు రైతు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు. ఈక్రమంలో గత నెల 30న మండలంలోని బంజేరుపల్లి తండాకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీతో పాటు మరో రెండు ట్రాక్టర్‌ల హైడ్రాలిక్ పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లారు. అదే రాత్రి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఆటో బ్యాటరీతో పాటు మరో రెండు ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలు, బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. అదే నెల 31న మండలంలోని కటికెనపల్లి శివారులో ఎస్‌ఆర్‌ఆర్ బ్రిక్స్ పరిశ్రమలోని టిప్పర్, రెండు ట్రాక్టర్లు, రెండు ఆటోలకు సంబంధించిన బ్యాటరీలతో పాటు హైడ్రాలిక్ పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లి దాదాపు రూ.80వేల నష్టం చేసినట్లు పరిశ్రమ యజమాని రాజ్‌కుమార్ తెలిపాడు.

గంజాయి కోసమేనా..?

మండలంలోని పలు గ్రామాల్లో కొందరు యువకులు గంజాయికి బానిసై చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల శివారులోని మామిడితోటలు, గుట్టల సమీపంలో అడ్డా ఏర్పాటు చేసుకుని నిత్యం గంజాయిని సేవిస్తూ వికృతచేష్టలకు పాల్పడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా రూ.లక్షలు విలువ చేసే వాహనాల పరికరాలను స్క్రాప్ దుకాణదారులకు అతి తక్కువ ధరలకే విక్రయిస్తుండటంతో వారు పోటీపడి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

టేకు కలప పట్టివేత

- దాడి చేసిన సీసీఎస్ పోలీసులు
- అటవీశాఖ అధికారులకు అప్పగింత



లింగంపేట శివారులో సీసీఎస్ పోలీసులు పట్టుకున్న టేకు కలప

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం లింగంపేట శివారులోని పోలీసు అమర వీరుల స్తూపం సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను సీసీఎస్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీసీఎస్ ఎస్సై రవీందర్ నాయుడు తెలిపిన వివరాలు. లింగంపేటలో భారీ ఎత్తున టేకు కలపను నిల్వ చేశారన్న సమాచారంతో సీసీఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలప లభించింది. పట్టుకున్న కలపను అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. కొలతల ప్రకారం లెక్కలు కట్టాల్సి ఉంటుందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.